జీజీహెచ్‌లో అరుదైన ఆపరేషన్లు

- గ్యాస్ట్రో ఎంట్రాలజీలో పోయమ్, ఈయుఎస్ విధానాల్లో చికిత్స

కర్నూలు(హాస్పిటల్): హైదరాబాద్, చెన్నై లాంటి మహానగరాల్లో మాత్రమే నిర్వహించే అత్యాధునిక ఆపరేషన్లు, చికిత్సలను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో నిర్వహించారు. అకలేషియా కార్డియా అనే సమస్యతో బాధపడుతున్న ఐదుగురికి పోయమ్ విధానంలో, లివర్ జబ్బుతో బాధపడుతున్న మరొకరికి ఈయుఎస్ విధానంలో చికిత్స అందించి ఊపిరి పోశారు. పోయమ్ చికిత్సను కర్నూలుకు చెందిన రామసారమ్మ (40), మద్దికెరకు చెందిన రామాంజనమ్మ (43), శ్రీశైలంకు చెందిన పి.లక్ష్మి (42), తెలంగాణా రాష్ట్రంలోని గద్వాలకు చెందిన సువర్ణమ్మ (56), ఎన్.సుల్తానా (38) అకలేషియా కార్డియా అనే సమస్యతో బాధపడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చారు. వారి ఆహార వాహికలో పై భాగం మెత్తగా, మధ్యభాగం వెడల్పుగా, బలహీనంగా, కింది భాగం గట్టిగా ఉంటుంది. పుట్టుకతో వచ్చే ఇలాంటి సమస్యకు గతంలో శస్త్రచికిత్స నిర్వహించి సరిచేసేవారు. ఇప్పుడు పర్ ఓరల్ ఎండోస్కోపిక్ మయాటమి (పోయమ్) అనే విధానంలో హైదరాబాద్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ (ఏఐజీ) సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ మోహన్ రామ్ చందాని ఆధ్వర్యంలో హెచ్‌ఓడీ డాక్టర్ జి.మోహన్‌రెడ్డి, సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ అర్షియా సుల్తానా, డాక్టర్ సందీప్‌కుమార్‌రెడ్డి ఎండోస్కోపి ద్వారా శస్త్రచికిత్స నిర్వహించారు. వీరికి అనస్తీషియా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మురళీప్రభాకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్య మత్తు మందు ఇచ్చి సహకారం అందించారు. కాగా కాలేయ జబ్బు కారణంగా రక్తనాళాలు ఉబ్బడం వల్ల అవి చిట్లిపోయి రక్త వాంతులు వచ్చే సమస్యను అత్యాధునిక పరికరంతో గైడెడ్ కాయిల్, గ్లూ ఇచ్చి నంద్యాలకు చెందిన కె.వెంకట రమణారెడ్డికి చికిత్స చేశారు. ఇలాంటి చికిత్సను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నిర్వహించడం మొదటిసారని గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ జి.మోహన్‌రెడ్డి తెలిపారు.


ఎండోస్కోపి ద్వారా పోయమ్ చికిత్స చేస్తున్న వైద్యుల బృందం

నేడు యోగా కార్యక్రమం

ఓర్వకల్లు: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం సోమయాజులపల్లె బ్రహ్మకుమారీస్ మ్యూజియంలో యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంపూర్ణ ఆరోగ్య భారత్ లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు యోగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలో కనీసం రెండు వేల మంది ప్రజలు యోగా కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. ఉదయం 7 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాల మేరకు ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. ప్రజల రాకపోకల నిమిత్తం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యోగాసనాల అనంతరం అల్పాహారం ఉంటుందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

స్టాఫ్ నర్సుకు డాక్టరేట్


డాక్టరేట్ పట్టాతో మంజులాదేవి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న డి.మంజులాదేవికి డాక్టరేట్ లభించింది. హైదరాబాద్‌లో ఆదివారం ది అమెరికన్ యూనివర్సిటీ (యుఎస్ఏ) వారు ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు. సామాజిక సేవలో భాగంగా తాను అందించిన సేవలకుగాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆమె తెలిపారు.

పత్తి ఓబులయ్యకు పురస్కారం


పురస్కారం అందుకున్న పత్తి ఓబులయ్య

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రం (లలిత కళా సమితి) అధ్యక్షుడు పత్తి ఓబులయ్యకు ఆదివారం సాయంత్రం పల్నాడు జిల్లా సాతులూరులో ఎన్టీఆర్ పురస్కారం ప్రదానం చేశారు. జాతీయ స్థాయి నాటకోత్సవాల్లో భాగంగా ఆయనకు నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు ఈ పురస్కారాన్ని అందజేశారు.

ప్రశాంతంగా రెండో దశ ప్రవేశ పరీక్ష


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీసీఓ శ్రీదేవి

కల్లూరు: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 10 ఐఐటీ, మెడికల్ అకాడమీల్లో శిక్షణ పొందడానికి ఆదివారం నిర్వహించిన రెండో దశ ఎంపిక పరీక్ష ప్రశాంతంగా జరిగిందని చిన్నటేకూరు డాక్టర్ అంబేడ్కర్ గురుకుల ఐఐటీ, మెడికల్ అకాడమీ డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప తెలిపారు. మొత్తం 540 మంది విద్యార్థులకు గాను 418 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. సాంఘిక సంక్షేమ గురుకులాల కర్నూలు జిల్లా డీసీఓ ఐ.శ్రీదేవి కేంద్రంలో జరుగుతున్న పరీక్ష నిర్వహణను పరిశీలించారు. ప్రిన్సిపాల్ మహానంది, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనం!


నిరుపయోగంగా ఉన్న భవనం

కల్లూరు: మండల పరిధిలోని పెద్దపాడులో ఉన్న ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ కార్యాలయ భవనం గత కొన్ని నెలలుగా నిరుపయోగంగా ఉంది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారక ముందే అధికారులు స్పందించి ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగించుకోవచ్చు కాదా? అని పెద్దపాడు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. భవనం వినియోగంలో లేకపోవడం వల్ల బయట గోడలు, లోపల ఫ్లోరింగ్ కుంగిపోయ్యే అవకాశం ఉందని సామాన్య ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరకముందే అధికారుల స్పందించి ఇతర ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకుంటే ప్రజాధనం నిరుపయోగం గాకుండా ఉంటుందని పేర్కొంటున్నారు.

రోడ్డును బాగు చేయండి సారూ!


చిన్నటేకూరు వద్ద దెబ్బతిన్న రోడ్డు

కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో ప్రధాన రోడ్డు మధ్య వరకు ఛిద్రమైంది. ఈ రోడ్డుపై బస్తిపాడు, బొల్లవరం, పుసులూరు, అనుగొండ వరకు, చిన్నకొట్టాల, పెద్దకొట్టాల, నాగలాపురం మీదుగా కోడుమూరు, గూడూరు తదితర ప్రాంతాలకు చెందిన వాహనాలు తిరుగుతుంటాయి. అలాగే భారీ వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రోడ్డు మధ్య వరకు దెబ్బతినడం వల్ల ఎదురెదురుగా వాహనాలు వస్తే ట్రాఫిక్ జామ్ అవుతోంది. అధికారుల స్పందించి రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వైద్య పరీక్షల కేంద్రాలను పెంచాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అల్ట్రాసౌండ్ స్కానింగ్, రక్త పరీక్షల కేంద్రాలను పెంచాలని బహుజన విద్యార్థి వేదిక జాతీయ అధ్యక్షుడు బీవీ రమణ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఆసుపత్రికి మూడు రాష్ట్రాల నుంచి రోగులు అధిక సంఖ్యలో తరలివస్తారని, ఈ మేరకు రద్దీ దృష్ట్యా వైద్య పరీక్షల కేంద్రాలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఏ రోజుకారోజు రిపోర్టులను రోగులకు ఇస్తే వారు అదే రోజు డాక్టర్ల వద్ద చికిత్స చేయించుకుని వెళ్తారన్నారు.

సేవా దృక్పథం కలిగి ఉండాలి


మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకట రమణయ్య

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం కలిగి ఉండాలని డ్వామా పీడీ వెంకట రమణయ్య సూచించారు. మానవనత స్వచ్ఛంద సేవా సంస్థ నెలవారీ సమావేశం ఆదివారం వీఆర్ కాలనీలోని సంస్థ కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మానవతా సంస్థ చేపట్టే కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని కొనియాడారు. బాడీ ఫ్రీజర్ బాక్స్, శాంతి రథం, రక్తదాతలను ఏర్పాటు చేయడం లాంటివి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయన్నారు. మానవతా జిల్లా కన్వీనర్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ మే మాసంలో బాడీ ఫ్రీజర్ బాక్సులు 42 మందికి ఉపయోగ పడ్డాయన్నారు. 20 మందికి రక్తదానం చేశామన్నారు. డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్ పాటిల్ హనుమంతరెడ్డి మాట్లాడుతూ.. మావనతా సేవా కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సంస్థ ద్వారా ఎక్కువ మందికి సేవా కార్యక్రమాలు అందేలా సభ్యులు కృషి చేయాలన్నారు. నగర అధ్యక్షుడు శోభన్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రోగ్రాం కమిటీ ఛైర్మన్ యుగంధర్ శెట్టి, ఆత్మీక కమిటీ ఛైర్మన్ ప్రభాకర్, శాంతి ర్యాలీల కమిటీ ఛైర్మన్ శివారెడ్డి, సభ్యులు శేషయ్య, రమణ, హరీష్ పాల్గొని మాట్లాడారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు సమర్పించుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని ఆయన వివరించారు.

అర్జీల సమాచారం కోసం 1100కు ఫోన్ చేయొచ్చు

అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు.

నగరపాలక సంస్థలో..

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు.

తప్పిపోయిన పిల్లలను వెతికి పట్టుకోవాలి


మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ పి.నిర్మల

కర్నూలు (టౌన్): తప్పిపోయిన పిల్లలను గుర్తించి వాళ్లను 24 గంటల్లోపు జిల్లా బాలల సంక్షేమ సమితి ఎదుట హాజరు పరచాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి.నిర్మల సూచించారు. ఆదివారం జిల్లా లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో స్థానిక వెంకటరమణ కాలనీలోని నైస్ యూత్ ఫర్ కల్చర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలో నేషనల్ మిస్సింగ్ చిల్డ్రన్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ.. పిల్లలు తమ తల్లిదండ్రులు తిట్టారని, కొట్టారనే కారణాలతో పారిపోవడం వంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయన్నారు. ఆ పిల్లలు బస్సుల్లో గాని, రైలులో గానీ ప్రయాణం చేస్తుంటారని, సంఘ విద్రోహ శక్తులకు దొరికితే వారి భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. తప్పిపోయిన పిల్లలను వెతికి పట్టుకొని బాలల సంక్షేమ సమితి వద్దకు తీసుకొస్తే వారికి వసతి కల్పిస్తామన్నారు. పిల్లలు చెప్పే వివరాలను నమోదు చేసుకొని ట్రాకింగ్ మిస్సింగ్ చైల్డ్ అనే పోర్టల్‌లో నమోదు చేస్తామని చెప్పారు. దీని వల్ల త్వరగా పిల్లలు ట్రేస్ ఔట్ అవుతారన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైల్డ్ లీగల్ రైట్స్ కమిటీ సభ్యులు రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. చిన్నారులు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండేలా తల్లిదండ్రులు తగిన సూచనలు చేయాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి శారద, శ్రీలక్ష్మి, పద్మ, గీత, వాణి, శ్వేత, కీర్తి, రంగమ్మ పాల్గొన్నారు.

యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోండి


ఖనా-ఖజానా వద్ద ఏర్పాట్లపై ఇంజినీర్లతో మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక బిర్లా కాంపౌండ్ వద్ద ఉన్న ఖానా-ఖజానా వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు యోగాసానాల శిక్షణ ఉంటుందన్నారు. యోగా సాధనతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని, మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. రోగ నిరోధక శక్తిని పెంచుతుందన్నారు. ప్రతి పౌరుడు యోగాను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. మేనేజర్ చిన్నరాముడు, డీఈఈ గిరిరాజు,. వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగం కురవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం రామక్రిష్ణ పాల్గొన్నారు.

7న కూర్మ జయంతి వేడుకలు


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ధార్మిక సంస్థల ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: కూర్మ జయంతి వేడుకల ఆహ్వాన పత్రికలను వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు ఆదివారం రెవెన్యూ కాలనీలోని భరత మాత ఆలయంలో ఆవిష్కరించారు. ఆవిష్కరణలో పాల్గొన్న లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి మాట్లాడుతూ.. నల్లగుట్ట శ్రీ కూర్మ క్షేత్రం మహిమాన్వితమైన పుణ్య స్థలమన్నారు. భక్తులు క్షేత్రాన్ని సందర్శించి స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు. క్షేత్ర కార్యనిర్వాహకులు ఏజీ నరేష్ మాట్లాడుతూ.. శేష్ట శుద్ధ ద్వాదశి జూన్ 7వ తేదీన ఆస్పరి మండలం హలిగెర గ్రామంలోని స్వయంభూ నల్లగుట్ట శ్రీ కూర్మ క్షేత్రం 12వ కూర్మ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 7వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 27 సార్లు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, హరికూర్మ గిరి ప్రదక్షిణ, నవ నాగుల పుట్టల పూజలు, కూర్మనారాయణ స్వామి పల్లకి సేవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వేడుకల్లో 12 మంది పూజ్య స్వామీజీలు పాల్గొంటారన్నారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు మల్లెల పుల్లారెడ్డి, సందడి మహేశ్వర్, ప్రతాప్‌రెడ్డి, టీసీ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

గుండె జబ్బులను నిర్లక్ష్యం చేయొద్దు


డాక్టర్ తోట నాగేంద్రప్రసాద్‌ను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): గుండె జబ్బులకు సంబంధించి ఎలాంటి లక్షణాలు అగుపించినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని, అధిక కొలెస్ట్రాల్ ఉండే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలని కార్డియాలజిస్టు డాక్టర్ తోట నాగేంద్రప్రసాద్ సూచించారు. కర్నూలు కార్డియాక్ సెంటర్, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వెంకటరమణ కాలనీలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి ఈసీజీ, షుగర్, బీపీ, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలను నిర్వహించి తగు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ తోట నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. గుండెజబ్బులు, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆహారంలో ఫైబర్ అధికంగా ఉండే పదార్థాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు మురారి, శంకరప్ప, రామకృష్ణ, తిరుపతి సాయి, వెంకటస్వామి, కేడీజే బాబు, గోపీనాథ్, రాయపాటి నాగలక్ష్మి పాల్గొన్నారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు


మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేసిన దృశ్యం

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం సందర్భంగా మాళ మల్లేశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సుప్రభాతసేవ, అభిషేకాలు, బండారార్చన, పుష్పార్చన, మహా మంగళ హారతి, ఆకుపూజ, నివేదన, నిరాజనం తదితర పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి మూల మూర్తులను పూలు, ఆకులతో ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ పలకరింపు


గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

కర్నూలు సిటీ: హాయ్‌రా.. ఎలా ఉన్నావ్.. ఏం చేస్తున్నావ్.. నిన్ను చూసి చాలా కాలమయ్యిందిరా.. చాలా మారిపోయావ్.. ఎంత మంది పిల్లలు.. వారేం చేస్తున్నారు. అంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు కోల్స్ మెమోరియల్ జూనియర్ కాలేజీ 1993–95 బ్యాచ్ పూర్వ విద్యార్థులు. ఆ కాలేజీ సీఈసీ గ్రూప్ ఏ సెక్షన్‌కు చెందిన వారందరూ మూడు దశాబ్దాల తరువాత ఆదివారం ఆ కాలేజీలో కలుసుకొని వారి బాగోగులను ఒకరికొకరు అడిగి తెలుసుకున్నారు. నాటి మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకొని సంతోష పడ్డారు. వారికి చదువు చెప్పిన ఇంగ్లిష్ లెక్చరర్ ప్రభాకర్‌రావు, ఎకనామిక్స్ లెక్చరర్ మోజేస్, ప్రస్తుత కాలేజీ ప్రిన్సిపాల్ నెహిమియాను ఘనంగా సన్మానించి, వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆత్మీయ సమావేశానికి కృషిచేసిన పూర్వ విద్యార్థి మద్దిలేటికి ధన్యవాదాలు తెలిపారు. కాలేజీ పూర్వ విద్యార్థులు బుక్కరాయసముద్రం సీఐ పుల్లయ్య, ఫిజికల్ డైరెక్టర్ సుబ్రమణ్యం, పంచాయతీ సెక్రటరీ వేణుగోపాల్, కానిస్టేబుళ్లు రవి, చాంద్ బాష, ఎక్సైజ్ సీఐ మొహిద్దీన్, ఆలూరు మార్కెట్ యార్డు సెక్రటరీ సునీత, అజిత, డీఆర్‌డీఏ ఏపీఎం ఎం.బి వెంకటస్వామి, డ్వామా ఏపీడీ సురేష్, కె.శేఖర్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమ బాట


మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

కర్నూలు(సెంట్రల్): ప్రజా వ్యతిరేక పాలకుల నుంచి రాజ్యాంగ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని జిల్లా కార్యవర్గ సభ్యుడు పీఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్, రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ అజెండాతో ఉద్యోగులు, కార్మికులు, రైతులు, కూలీలను అప్పులపాలయ్యేలా చేస్తోందన్నారు. తద్వారా కార్పొరేట్లకు లక్షల కోట్ల ఆదాయన్ని పెంచుకునేలా చేస్తోందన్నారు. అలాగే మహిళలు, దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు అధికమయ్యాయని, ఈ నేపథ్యంలో బీజేపీని ఒంటరి చేయడం, ఓడించడం అనే కర్తవ్యాన్ని రచించుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ప్రజా, సామాజిక పోరాటాలను ఉద్ధృతం చేయాలన్నారు. మరోవైపు సీపీఎంను గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడంపై క్యాడర్ దృష్టి సారించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, ఎండీ ఆనంద్‌బాబు, టి.రాముడు, వెంకటేశ్వర్లు, కేవీ నారాయణ, రామాంజనేయులు, ఎం.రాజశేఖర్, గురుశేఖర్, అలివేలు, లింగన్న, లక్ష్మన్న వీరశేఖర్, గోవిందు పాల్గొన్నారు.

భీమలింగేశ్వరునికి ఘనంగా మెట్ల పూజ


మెట్ల పూజ నిర్వహిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: మండలంలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో కొలువైన అన్నపూర్ణ సమేత భీమలింగేశ్వరుడికి ఆదివారం మాస శివరాత్రి పురస్కరించుకుని మెట్లపూజా మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్తలు పూడూరు లక్ష్మిరెడ్డి, నాగేశ్వరమ్మ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో వెల్దుర్తి అభయాంజనేయస్వామి విగ్రహ నిర్మాణ కర్త రామాంజనేయులు, కర్నూలుకు చెందిన లలితాదేవి ఆలయ పీఠాధిపతి మేడం సుబ్రహ్మణ్యం, భవానీ దీక్షాపరులు లడ్డూ భవాని, షిరిడి సాయినాథ ఆలయ పీఠాధిపతి మేడం శ్రీనివాసులు, గుత్తి కొత్తపేట వెంకటేశ్వరస్వామి ఆలయ పీఠాధిపతి లక్ష్మయ్య హాజరై భీమ లింగేశ్వరునికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భజన సాగిస్తూ మెట్లపూజ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో కొనసాగించారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.


బొమ్మిరెడ్డిపల్లెలో భీమలింగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న పలు ఆలయాల పీఠాధిపతులు

సీహెచ్‌ఓల సమ్మె విరమణ

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రవ్యాప్తంగా గత 27 రోజులుగా కొనసాగుతున్న సీహెచ్‌ఓ(ఎంఎల్‌హెచ్‌పీ)ల సమ్మెను ఆదివారం విరమించారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం కొనసాగిస్తున్న సమ్మె విషయంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్లు ఏపీఎంసీఏ జిల్లా అధ్యక్షురాలు చందన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సోమవారం నుంచి విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో విధులకు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

సీఐను సస్పెండ్ చేయాలి


మాట్లాడుతున్న కె.ప్రభాకరరెడ్డి

కర్నూలు(సెంట్రల్): టీజీవీ ఆల్కలీస్ ఫ్యాక్టరీతో వచ్చే కాలుష్యంపై కవిత రాసిన సీపీఎం నాయకుడు వి.వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసిన కర్నూలు మూడో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ శేషయ్యను సస్పెండ్ చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి డీజీపీ, ఎస్పీని విన్నవించారు. ఆదివారం కర్నూలు సుందరయ్య భవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. టీజీవీ పరిశ్రమతో ఇప్పటికే నీరు, గాలి, భూమి కలుషితం అయ్యాయని, ఆ ప్రాంత ప్రజలు అనారోగ్యం బారిన పడ్డారని చెప్పారు. ఈ క్రమంలో రూ.710 కోట్లతో విష రసాయనాల ఉత్పత్తి కోసం పర్యావరణ అనుమతికి దరఖాస్తు చేసుకున్నారని, ఇలాంటి పరిశ్రమ వల్ల జనానికి హాని కలుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నా పట్టించుకోకుండా మే 14న ప్రజాభిప్రాయ సేకరణ చేశారన్నారు. ప్రజా సంఘాల నాయకులు అభ్యంతరాలు చెప్పకుండా రౌడీ మూకలతో అడ్డుకున్నారని, పోలీసులు, రెవెన్యూ అధికారుల ఎదుటే దాడి చేసినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఆ పరిశ్రమ కాలుష్యంపై కవిత రాసిన తమ పార్టీ నాయకుడు వి.వెంకటేశ్వర్లును రెండు రోజులు అక్రమంగా నిర్బంధించి ఫ్యాక్టరీలో పనిచేసే వ్యక్తితో 308 సెక్షన్ కింద కేసు నమోదు చేయించారని చెప్పారు. ఇదంతా మంత్రి టీజీ భరత్ అండతోనే జరిగిందని, సదరు సీఐ ఆయనకు ఏజెంట్‌గా మారారని విమర్శించారు. మరోవైపు కుమారుడి అండతో టీజీ వెంకటేష్ రెచ్చిపోతున్నారని, గతంలోనూ ఓ రిపోర్టర్‌పై కేసు నమోదు చేయించి అరెస్టు చేయించారని ఆరోపించారు. టీజీ భరత్ మంత్రిగా ఉన్నా జిల్లాకు ఒరిగిందేమీ లేదని, కేవలం ఆయన తన ఫ్యాక్టరీలు, వ్యాపారాలను మాత్రమే వృద్ధి చేసుకుంటున్నారని విమర్శించారు.

గార్గేయపురం రోడ్డును నిర్మించాలి

- రేపటిలోగా పనులు మొదలుపెట్టకపోతే జాతీయ రహదారిని దిగ్బంధిస్తాం
- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఓర్వకల్లు: గార్గేయపురం నుంచి కేతవరం మీదుగా పూడిచెర్ల స్టేజీ వరకు రోడ్డు నిర్మాణ పనులను ఈ నెల 27వ తేదీలోగా మొదలు పెట్టాలని, లేని పక్షంలో జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ స్పష్టం చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులు చేపట్టాలని గతంలో అనేకసార్లు అధికారులకు విన్నవించినా.. ఏ మాత్రం స్పందన లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేతవరం గ్రామానికి కూతవేటు దూరంలో ఆదిమానవులు సంచరించిన ఆనవాళ్లు, చిత్రాలతో గుహలు ఉన్నాయని, ఓర్వకల్లు, నన్నూరు ప్రాంతాల నుంచి నందికొట్కూరు ప్రాంతంలోని గ్రామాలకు వెళ్లేందుకు అనేక మంది వాహనదారులకు ఈ రోడ్డు అనువుగా ఉంటుందని తెలిపారు. అలాంటి రోడ్డు పనులను అర్ధాంతరంగా నిలిపివేయడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రజల సౌలభ్యం కోసం గత ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తే, ఈ ప్రభుత్వంలో నిర్మాణ పనులు మొదలుపెట్టి, కమీషన్ల కోసమో లేక నిధుల కొరతనో తెలియదుగానీ పనులు నిలిపివేశారని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఈ నెల 27వ తేదీలోగా నిర్మాణ పనులను ప్రారంభించాలని, లేని పక్షంలో 27వ తేదీన పూడి చెర్ల మెట్ట వద్ద జాతీయ రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరించారు. సమావేశంలో వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న, సీఐటీయూ మండల కార్యదర్శి శ్రీధర్, ప్రజా సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, చంద్రబాబునాయుడు, మధుసూదన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.